పశు వైద్యశాలల్లో సమస్యలు

- పెచ్చులూడుతున్న శ్లాబులు, ధ్వంసమైన పిల్లర్లు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- ప్రైవేటును ఆశ్రయిస్తున్న పాడి రైతులు



అన్నపురెడ్డిపల్లి పశు వైద్యశాలలో పెచ్చులూడిన శ్లాబు



శిథిలావస్థకు చేరిన రాజాపురం పశు వైద్యశాల

అన్నపురెడ్డిపల్లి: పశువులకు వైద్యం అందించే వైద్య శాలలు శిథిలావస్థలకు చేరుకున్నాయి. పశువైద్యశాలల శ్లాబ్‌ల పెచ్చులు ఊడిపోతున్నాయి. దీంతో ఆయా వైద్యశాలలు ప్రమాదకరంగా మారాయి. 2016 సంవత్సరంలో నూతనంగా అన్నపురెడ్డిపల్లి మండలాన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో ప్రాథమిక పశువైద్యశాల ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇక్కడ సబ్ సెంటర్ మాత్రమే ఉంది.మండల కేంద్రానికి 14 కిలోమీటర్ల దూరంలో ఎర్రగుంటలో ప్రాథమిక పశువైద్యశాల ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలం కేంద్రంలోనే నూతన ప్రాథమిక పశువైద్యశాలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మండలంలో భారీగా పశుసంపద..మండలంలో పశుసంపద భారీగానే ఉంది. మండల వ్యాప్తంగా ఆవులు, గెదేలు, గొర్రెలు, మేకలు మొత్తంగా 28,555 ఉన్నట్లు పశుగణాంకాలు తెలియజేస్తున్నాయి. వాటిల్లో ఆవులు 2060, గెదేలు 5631, గొర్రెలు14342, మేకలు 6522 ఉన్నాయి. మండలంలోని రాజాపురం, అబ్బుగూడెం, మర్రిగూడెం, రామకృష్ణాపురం, ఎర్రగుంట గ్రామాలలో గొర్రెలును అధికంగా పెంచుతున్నారు. మండలంలో ఇంతలా భారీగా పశు సంపద ఉన్నప్పటికీ పశువైద్యశాలలు సరైన స్థితిలో లేవు.

ప్రమాదకరంగా ఆస్పత్రులు..

ఎర్రగుంటలోని ప్రాథమిక పశువైద్యశాల పరిధిలో రాజాపురం, అన్నపురెడ్డిపల్లి గ్రామాల్లో రెండు గ్రామీణ పశువైద్యశాలలు ఉన్నాయి. మండలంలోని ఈ మూడు పశువైద్యశాలలూ శిథిలావస్థలకు చేరుకున్నాయి. వైద్యశాలల భవనాలు శ్లాబ్ పెచ్చులు ఊడి పోతున్నాయి, పిల్లర్లు కూడా ధ్వంసమనాయి. గోడలకు పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. వర్షా కాలంలో వర్షం కురిస్తే వాన నీరు వైద్యశాలలోకి చేరుతోంది. దీంతో ఇక్కడ పనిచేసే సిబ్బంది ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయం వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది కొరత..

మండలంలోని మూడు పశువైద్యశాలల్లో సిబ్బంది కొరత వేధిస్తుంది. గత రెండు సంవత్సరాలుగా మండల పశువైద్యాధికారి పోస్ట్‌లో ఇన్‌చార్జ్ పనిచేస్తున్నారు. ఎర్రగుంట ప్రాథమిక పశువైద్యశాలలో డాక్టర్, అటెండర్ ఉండాలి కానీ ప్రస్తుతం డిప్యూటేషన్‌పై వెటర్నరీ అసిస్టెంట్ పనిచేస్తున్నాడు. రాజాపురం సబ్ సెంటర్‌లో వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ పనిచేస్తుండగా, అవుట్‌సోర్సింగ్‌లో అటెండర్ ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. అన్నపురెడ్డిపల్లిలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్ట్ కొన్ని సంవత్సరాలుగా ఖాళీగా ఉంది. ఇక్కడ అటెండర్ మాత్రమే పని చేస్తున్నారు.మండలంలో ఇద్దరు గోపాల మిత్రాలు తమ సేవలను అందిస్తున్నారు. గొర్రెలకు, మేకలకు అందించే నట్టల నివారణ మందును ప్రభుత్వం అందించడం లేదు. దీంతో రైతులే నట్టల మందులను కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం పశువులకు గాలి కుంటు నివారణ టీకాల కార్యక్రమం కొనసాగుతుండగా.. ఈ కార్యక్రమాన్ని ఇప్పుడు ఉన్న సిబ్బందే అమలు చేస్తున్నారు. శిథిలావస్థలకు చేరిన పశువైద్యాశాలలు, సిబ్బంది కొరతతో పశువులకు సరైన వైద్యం అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నూతన భవనాలు నిర్మించాలి



మండల కేంద్రంలోని పశు కేంద్రం పూర్తిగా దెబ్బతింది. మండల కేంద్రంలో ప్రాథమిక పశు వైద్యశాలను నిర్మించాలి. సిబ్బంది కొరతతో పశువులకు వైద్యం అందడం లేదు. జబ్బున పడిన పశువుల వైద్యం కోసం ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తుంది.

– అల్లూరి శ్రీనివాసరావు, పాడిరైతు, అన్నపురెడ్డిపల్లి

ప్రతిపాదనలు పంపించాం..



శిథిలావస్థలకు చేరిన పశువైద్యశాలపై ప్రతిపాదనలను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేధికలు పంపించాం. పశువుల వైద్యానికి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేస్తున్నాం.

– డాక్టర్ రాంప్రసాద్, మండల పశువైద్యాధికారి

నత్తనడకన వంతెన పనులు



ఇసుకవాగుపై నిర్మిస్తున్న వంతెన

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామంలో ఇసుకవాగుపై నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత ఏడాది మే 29న ఇసుకవాగుపై రూ.7 కోట్లతో నిర్మించనున్న హైలెవల్ వంతెనకు గత ప్రభుత్వంలో శంకుస్థాపన చేశారు. ఏడాది కాలంగా వంతెన పనులు నత్తనడకన సాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో వంతెన పనులు వేగవంతంగా సాగడం లేదు. వర్షా కాలం సమీపిస్తున్నా పనుల్లో పురోగతి లేదు. వర్షా కాలంలోపు పనులు పూర్తి అయ్యే అవకాశం లేదు. ఇసుకవాగు వల్ల వర్షాకాలంలో గొందిగూడెం, గొందిగూడెం కొత్తూరు, ఎలకలగూడెం, మనుబోతుల గూడెం గ్రామ పంచాయతీలలోని ఇరవై గ్రామాల గిరిజనులు రాకపోకలు నిలిచి గిరిజనులు బాహ్య ప్రపంచానికి దూరమై మౌలిక సదుపాయాలు అందక మూడు నెలల పాటు ఇబ్బందులు పడతారు. ఎన్నో ఏళ్లగా గిరిజనులు ఇసుకవాగు వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది క్రితం వంతెన పనులు చేపట్టినా వర్షాకాలం లోపు వంతెన పనులు పూర్తయ్యేలా లేవు. వంతెన పనుల కారణంగా రాకపోకలకు అప్రోచ్ రహదారి నిర్మించారు. వర్షాకాలంలో ఇసుకవాగు వల్ల అప్రోచ్ రహదారిపై కనీస రాకపోకలకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన పనులు వేగవంతం చేసి రెండు నెలల్లో పూర్తి చేయాలని గిరిజనులు కోరుతున్నారు. ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించి వంతెన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని వర్షాకాలంలో ఇబ్బందులు పడకుండా చూడాలని గిరిజనులు కోరుతున్నారు. వంతెన పనుల్లో నాణ్యత పాటించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఆలయ భూములను కాపాడాలి

చర్ల: చర్లలో సర్వే నెంబర్ 117లో ఉన్న కన్యకా పరమేశ్వరి దే జీ ఆలయ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని వాటిని రెవెన్యూ అధికారులు కాపాడాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ డివిజన్ కార్యదర్శి కొండా చరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం చర్లలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి కొండా చరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల ఆక్రమణ సర్వసాధారణం అయ్యిందని, తాజాగా కబ్జాదారులు ఆలయ భూములను, చెరువు శిఖం భూములను ఆక్రమించడం ఆరంభం చేశారని ఆయన అన్నారు. అదే క్రమంలో చర్లలోని కన్యకా పరమేశ్వరి దేవీ ఆలయం భూములను కూడా ఆక్రమిస్తూ వాటికి అక్రమంగా కట్టడాలను చేపట్టారని ఆయన అన్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఈ తరహా ఆక్రమణలు కొనసాగుతున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ భూములలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారికి పంచాయితీ అధికారులు నో అబ్జక్షన్ సర్టిఫికెట్లు ఎలా ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. తక్షణమే రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టిసారించి ఆక్రమణలను నిలుపుదల చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కొండా కౌశిక్, నాయకులు చెన్నం మోహన్‌రావు, రాజా పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంకు ఉద్యోగుల బదిలీ

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు గ్రామంలోని డీసీసీబీ లక్ష్మీనగరం బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న మేనేజర్ నర్సింహారావు, క్యాషియర్ కేశవరావులు బదిలీ అయ్యారు. బుధవారం బదిలీ అయిన అధికారులను పీఏపీఎస్ అధ్యక్షుడు కిలిమి ఎల్లారెడ్డి వారిని ఘనంగా సన్మానించి వారు చేసిన సేవలను కొనియాడారు. సంఘం కార్యదర్శి ముత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా స్క్రీనింగ్ పరీక్షలు



దమ్మపేట: దురదపాడు గ్రామంలో రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

దమ్మపేట: మలేరియా వ్యాధి నిర్ధారణ, నివారణ కార్యక్రమంలో భాగంగా దమ్మపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సామూహిక రక్త పరీక్షలను నిర్వహించారు. బుధవారం మండల పరిధిలోని దురదపాడు గ్రామంలో, జిల్లా ఉప మలేరియా అధికారి గొంది వెంకటేశ్వర్లు సమక్షంలో గ్రామస్తులు అందరికీ సామూహిక రక్త పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప మలేరియా అధికారి మాట్లాడుతూ.. ఎవరికీ మలేరియా వ్యాధి సోకలేదని నిర్ధారణ అయ్యిందని అన్నారు. రానున్న వర్షకాలం దృష్ట్యా మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఇళ్ల పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూడాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు మణిదీప్, సబ్‌యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సూపర్వైజర్ రామారావు, భద్రమ్మ, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్ కిషోర్, ఆశాలు పాలొన్నారు.

చర్లరూరల్: చర్ల మండలంలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన కందిపాడులో బుధవారం కొయ్యూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 185 మందికి ముందస్తుగా మలేరియా రక్తనమూనాలను సేకరించారు. వీరందరికీ నెగిటివ్ వచ్చిందని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ రాంప్రసాద్,హెల్త్ అసిస్టెంటు ధర్మారావు, నరసింహారావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఇటీవల వైరల్ జ్వరాలతో వణికిపోయిన లక్ష్మీకాలనీలో జ్వరాలు పూర్తిగా అదుపులోనే ఉన్నాయని, కొంతమందికి మాత్రమే ఒళ్లు నొప్పులు ఉన్నాయని పీహెచ్‌సీ వైద్యుడు శ్రీధర్ తెలిపారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో సర్వే చేస్తున్నట్లు వెల్లడించారు.

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య

దుమ్ముగూడెం: లోక్‌సభ ఎన్నికల్లో మండలం నుంచి మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌కు భారీ మెజారిటీ లభిస్తుందని ఈ ఉత్సాహంతో రాబోయే పంచాయతీ ఎన్నికలలో సత్తా చాటాలని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య పార్టీ కేడర్‌కు సూచించారు. బుధవారం మండలంలోని గంగోలు వివిఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన రివ్యూ మీటింగ్‌లో ఆయన పాల్గొని బూత్‌ల వారిగా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని కాంగ్రెస్ పార్టీకి మహబూబాబాద్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌కి అత్యధిక మెజార్టీ ఇవ్వబోతుందని అన్నారు. అలాగే రాబోవు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్‌లో కూడా ఇదే ఉత్సాహంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు. అతి తొందరలో రాబోతున్న పంచాయతీ ఎలక్షన్లలో కూడా కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పని చేసి మండలంలో ఉన్న 37 పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులే సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. దానికి అనుగుణంగా కార్యకర్తలు ఇప్పటి నుంచే కష్టపడి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వీరమాచినేని వినీల్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మద్ది కుమారి, నాయకులు కంగాల వెంకటేష్,లంకా శివ కుమార్, పూజారి సూర్యచంద్రరావు, కనుబుద్ది దేవా, కెల్లా శేఖర్, తోటమల్ల సుధాకర్, తెల్లం హరి, రాజా రెడ్డి,సందీప్ రెడ్డి, సిద్ధి ప్రవీణ్, సోడే తిరుపతి, గుమ్మడి శీను, పర్ణశాల ఎంపీటీసీ తెల్లం భీమరాజు,మాజీ సర్పంచ్‌లు వర్షా చిన్నారావు, తెల్ల వరలక్ష్మి, శివరామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడులో అపరిశుభ్రత

బూర్గంపాడు: బూర్గంపాడు మేజర్ గ్రామపంచాయతీలో అపరిశుభ్రత రాజ్యమేలుతుందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు డి.పున్నంచంద్ ఆరోపించారు. బుధవారం బూర్గంపాడులోని అపరిశుభ్రత ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మురుగుకాలువలు పూడకపోయి రోడ్లపైనే మురుగు ప్రవాహిస్తుందన్నారు. దీంతో బూర్గంపాడులోని పలు ప్రాంతాలు దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మురుగు కాలువల పూడిక తీసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన కోరారు. లేకుంటే స్థానికులతో కలసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే కనకయ్యకు పరామర్శ



ములకలపల్లి: పుల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ములకలపల్లి: మండలానికి చెందిన పలువురు నాయకులు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను పరామర్శించారు. కనకయ్య తండ్రి కోరం పుల్లయ్య ఇటీవల మరణించారు. కాగా బుధవారం నిర్వహించిన దశదిన కర్మలో పాల్గొని పుల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సొసైటీ డైరెక్టర్ అనుమల సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు కారం సుధీర్, భూక్యా పత్తీలాల్, పర్వతనేని అమర్‌నాథ్, పువ్వాల మంగపతి, నాగళ్ల వెంకటేశ్వరరావు, గాడి తిరుపతిరెడ్డి, బాలఅప్పారావు, శనగపాటి అంజి, గుడ్డూరి నర్సింహారావు, తన్నీరు నాగయ్య, నల్లమోతు జగదీశ్ తదితరులు ఉన్నారు.

ఎంపీపీ ఆధ్వర్యంలో..

అశ్వాపురం: టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తండ్రి పుల్లయ్య దశదినకర్మలకు బుధవారం ఎంపీపీ ముత్తినేని సుజాత హాజరయ్యారు. పుల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దిన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్తినేని శ్రీనివాసరావు, రావులపల్లి వెంకటనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?



ప్రమాదకరంగా మారిన డ్రెయినేజీ మూల మలుపు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ రెండవ లైన్ శివాలయం దగ్గరలో డ్రెయినేజీ కాలువ మూలమలుపు ప్రమాదకంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ఇక్కడ అనేక సార్లు వాహనదారులు ప్రమాదాలకు గురైన్నారు. తరుచు ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు అటుగా ఒకేసారి వాహనాలు వెళ్లకుండా రాళ్ళను అడుగా పెట్టారు. అయిన రాత్రి సమయంలో రాళ్ళను గుర్తించని వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. దీంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతెనే పట్టించుకుంటారా.. అన్ని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మూల మలుపును మరమ్మతులు చేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

రహదారి నిర్మాణానికి గ్రహణం

- నిధులొచ్చి ఇప్పటికి ఏడేళ్లు..
- పర్యావరణ అనుమతులు లేక నిలిచిన పనులు
- రాకపోకలకు ఇబ్బందికరంగా రంగాపురం–గుండాల రోడ్డు



వర్షాకాలంలో సాయనపల్లి–దామరతోగు మధ్య రోడ్డు పరిస్థితి..

గుండాల: నక్సల్స్ ప్రభావిత ప్రాంత అభివృద్ధి నిధులతో మారుమూల ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందుతుందంటే ఈ ప్రాంత వాసులు ఎంతో సంతోషపడ్డారు. కానీ దేవుడు కరుణించినా పూజారీ కరునించని విధంగా.. నిధులు మంజూరి అయి ఏడేళ్లు అయినా అనుమతులు రాలేదు. దీంతో ఏజెన్సీ ప్రజలు పట్టణ ప్రాంతాలకు అనునిత్యం ప్రయాణం నరక ప్రాయమవుతుందని గిరిజన ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

గుండాల మండల కేంద్రం నుంచి వీరపురం వరకు 28 కిలోమీల వరకు మట్టి రోడ్డే దిక్కు. కాగా 2018లో నక్సల్స్ ప్రభావిత ప్రాంత అభివృద్ధి కింద బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.24.70 కోట్ల నిధులు మంజూరి అయ్యాయి. మజూరై ఏడేళ్లు గడుస్తున్నా రోడ్డు నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. ఫారెస్టు అనుమతి లేక పనులు నిలిచిపోయాయి.

ప్రయాణం ఓ నరకం..

నిధులు మంజూరి అయిన తర్వాత గుండాల సాయనపల్లి మధ్య 5 కిలోమీటర్లు, వెంకటాపురం, దామరతోగు గ్రామాల్లో కొంత మేర బీటీ వేశారు. మిగతా రోడ్డంతా అటవీశాఖ అనుమతులు లేవని పనులు నిలిపివేశారు. దీంతో ప్రతీ ఏటా వర్షాకాలంలో వరదల కారణంగా రోడ్డు కోతకు గురై అధ్వానంగా తయారవుతోంది. ప్రతి ఏటా మరమ్మతులు చేపడుతున్నా ఉపయోగం లేదు. మణుగూరు నుంచి ఆర్టీసీ బస్సులు నడుపుతుండగా వర్షాకాలం వచ్చిందంటే నాలుగు నెలల పాటు నిలిపివేస్తారు. అటు మణుగూరు వెళ్లాలన్నా.. ఇటు మేడారం వెళ్లాలన్నా కష్టమవుతుంది. కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి.

అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఆటంకం..

వెంకటాపురం, దామరతోగు పంచాయతీ ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో డ్లబండ్లు, ట్రాక్టర్లపై ప్రయాణించాల్సి వస్తుంది. వాహనాలు తిరగని క్రమంలో గర్భిణులు, రోగులు అటు మణుగూరు గానీ, ఇటు గుండాలకు గానీ రావాలంటే నరకం చూస్తున్నామని గిరిజనులు వాపోతున్నారు. వైద్యం అందక పలువురు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఇక నిత్యావసరాల కోసం గుండాలకు రావాల్సిందే. దీంతో వర్షాకాలంలో పడరాని పాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రతి ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ సారి రోడ్డు పనులు పూర్తి చేయిస్తామంటూ హామీలిచ్చి గెలిచిన తర్వాత చేతులు దులుపుకుంటున్నారని ఆయా పంచాయతీ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పలుమార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నిధులు మంజూరై ఏడేళ్లు గడుస్తున్నా ప్రధాన రహదారి సమస్యను పట్టించుకోని పాలకులు గ్రామాల్లో సమస్యలు ఏం పట్టించుకుంటారని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి అటవీశాఖ అనుమతులు వచ్చే కృషి చేయాలని గిరిజనులు వేడుకుంటున్నారు.

ఇబ్బందిగా ఉంది..



ఆస్పత్రికి వెళ్లాలన్నా, ఏదో అవసరం నిమిత్తం గుండాలకు వెళ్లాలన్నా సకాలంలో వెళ్లలేకపోతున్నాం. వర్షాకాలంలో నాలుగునెలల పాటు ఎటూ కదలలేని పరిస్థితి. ప్రతీ ఏటా ఈ సంవత్సరం రోడ్డు అవుతుందని ఎదురుచూస్తున్నాం. ఏడేళ్లుగా ఇంతే.

– మల్లెల సమ్మయ్య, వెంకటాపురం

ఎవరూ పట్టించుకోవడం లేదు..



మేడారం వెళ్లాలన్నా, మణుగూరు వెళ్లాలన్నా రోడ్డు సరిగ్గా లేక వెళ్లలేక పోతున్నాం. పలుమార్లు ఈ రోడ్డు సమస్యపై అధికారులను, ప్రజా ప్రతినిధులను అడుగుతున్నా ఎవరూ స్పందించడం లేదు. ఈ ఏడాదికైనా పనులు పూర్తి చేయాలి.

– కత్తుల రాంబాబు, సాయనపల్లి

అనుమతులొచ్చాక ప్రారంభిస్తాం..

సాయనపల్లి–వీరాపురం వరకు 28 కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం 2018లోనే నిధులు మంజూరు అయ్యాయి. కానీ రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు రాలేదు. అయితే మార్గం మధ్యలో ఉన్న బ్రిడ్జి పనులు మాత్రం పూర్తయ్యాయి. అటవీశాఖ అనుమతులు రాగానే రోడ్డు పనులూ ప్రారంభిస్తాం.

– మోతీలాల్, ఆర్అండ్‌బీ ఏఈ

క్లుప్తంగా

న్యాయవాదుల సంక్షేమానికి పెద్దపీట

బూర్గంపాడు: న్యాయవాదుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని కాంగ్రెస్ లీగల్‌సెల్ జిల్లా నాయకుడు భజన సతీష్ అన్నారు. బుధవారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు న్యాయవాదుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు కేటాయించటం హర్షణీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్ కృషితో ఈ నిధులు సాధించుకున్నామన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్‌గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సేవా కార్యక్రమాలే లక్ష్యం

అశ్వారావుపేటరూరల్: రానున్న రోజుల్లో లయన్స్‌క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించడమే లక్ష్యామని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ సీహెచ్‌వీ శివ ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని ఊట్లపల్లి సమీపంలోగల వెంకమ్మ చెరువు పార్కు వద్ద సిమెంట్ బల్లాలను ఏర్పాటు చేయగా.. చిరు వ్యాపారులకు ఎండ నుంచి రక్షణ కోసం ఐదు గొడుగులు అందజేశారు. అలాగే అశ్వారావుపేటలోని అమ్మసేవా సదనంలో అనాథ వృద్ధుల కోసం రూ.15వేల విలువైన ఫ్రిజ్‌ను వేముల ప్రకాశ్ ఆర్థిక సాయంతో అందించి, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్ సేవ చేయడంలో ముందు ఉంటుందని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాధ్యులు యూఎస్ ప్రకాశ్, చలపతిరావు, కంచర్ల రామారావు, కోటగిరి సీతారామస్వామి, జల్లిపల్లి కొండ, కోటగిరి మోహన్‌రావు, జూపల్లి బ్రహ్మారావు, సమయమంతుల మహేశ్వరరావు, ఇనుగంటి ప్రవీణ్ కుమార్, చల్లా రామారావు, శ్రీను, లక్కినేని నరేంద్రబాబు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి



స్థానికులను పరీక్షిస్తున్న డాక్టర్ మధు

కరకగూడెం: ఆరోగ్యం పట్ల ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కరకగూడెం ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి కారం మధు సూచించారు. ఈ మేరకు ఆయన బుధవారం మండల పరిధిలోని పద్మాపురం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పలువురు గ్రామస్తులను పరీక్షించి ఉచితంగా మందులు ఇచ్చారు. సీజనల్ వ్యాధులపై అప్రమతంగా ఉండాలన్నారు. అనంతరం డ్రైడే కార్యక్రమాలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.అదేవిధంగా ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్న తమను సంప్రదించాలని పేర్కొన్నారు. శిబిరంలో హెల్త్ అసిస్టెంట్ నర్సింహారావు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

అన్నపురెడ్డిపల్లి: మండలంలో పెంట్లం గ్రామంలోని ఆనంద సీతారామ స్వామి వారి ఆలయంలో చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెంట్లం గ్రామంలోని ఆనంద రామచంద్ర ఆలయంలో దుండగులు హుండీని పగలగొట్టి దానిలో రూ.5 వేల నగదు అపహరించారు. బుధవారం ఉదయం గుడిని ఊడ్చేందుకు వచ్చిన మహిళ.. హుండీ పగలగొట్టి ఉండడం గమనించి, ఆలయ కమిటీ చైర్మన్ బన్నే నాగేశ్వరరావుకు సమాచారం అందించింది. ఆయన ఆలయ అర్చకుడు అంజనీకుమార్‌కు విషయం తెలియజేసి స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై చంద్రశేఖర్, కొత్తగూడెం క్లూస్ టీంతో కలిసి ఆలయాన్ని పరిశీలించారు. ఆధారాలను సేకరించారు. హుండీ చోరీ ఘటన పై ఆలయ కమిటీ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఎమ్మెల్సీగా మల్లన్నను గెలిపించాలి

చర్ల: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని చర్ల జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత కోరారు. చర్లలో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 27న జరిగే ఎన్నికల్లో మల్లన్నకు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసేలా ప్రచారం చేయాలని సూచించారు.

పలువురికి పరామర్శ

దమ్మపేట: మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు. బుధవారం దమ్మపేట గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీపీ పానుగంటి సత్యాన్ని పరామర్శించారు. ఇటీవలే ప్రమాదంలో గాయపడి, చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న యార్లగడ్డ శేఖర్‌ను పరామర్శించి, ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. నాయకులు దారా యుగంధర్, అబ్దుల్ జిన్నా, బెక్కం వెంకటేశ్వరరావు, రాజు, యార్లగడ్డ శ్రీను, కొలురి నాగయ్య, పానుగంటి చిట్టిబాబు పాల్గొన్నారు.